క్లుప్తంగా

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ



విరాళం అందజేస్తున్న బాలగంగాధరరెడ్డి కుటుంబసభ్యులు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి అమెరికాలో స్థిరపడిన పెండ్లిమర్రి మండల వాసి బుధవారం రు.1,00,116లు విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన చింతలపల్లె బాల గంగాధర రెడ్డి సతీమణి స్ఫూర్తి కుటుంబ సభ్యులతో వచ్చి నగదును అందజేశారన్నారు.వారిని సత్కరించి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్ర పటాన్ని బహూకరించినట్లు చెప్పారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పిను పోలు రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఇనగలూరులో వైద్య పరీక్షలు

తొండూరు : మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలోని ఫ్యామిలీ ఫిజిషియన్ క్లినిక్‌లో బుధవారం తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ వీరాంజనేయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి రిటైర్డ్ అగ్రికల్చర్ అధికారి విశ్వనాథ్‌రెడ్డి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై మంగళవారం మృతి చెందాడు. బుధవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి నంది మండలంలో మృతదేహానికి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ రామమోహన్‌రెడ్డిలు ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

వల్లూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లీ, జిల్లా క్షయవ్యాధి నోడల్ ఆఫీసర్ డాక్టర్ గోపీకృష్ణలు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. క్షయ, కుష్టు వ్యాధులను పూర్తిస్థాయిలో తగ్గించడానికి చేపట్టాల్సిన చర్యలను గురించి, అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ వందన యోజన, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి, సీహెచ్‌ఓ వేణుగోపాల్, ఫార్మసిస్టు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దముడియం : పెద్దముడియంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యశాఖాధికారి నాగరాజు, ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శాంతకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి పీహెచ్‌సీ సిబ్బందికి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిజాముద్దీన్, సూపర్ వైజర్ సుజాత పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దానగుణాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులకు దుస్తులను అందజేసిన తహసీల్దార్ గంగయ్య

చింతకొమ్మదిన్నె : సమాజంలో ప్రతి ఒక్కరూ దాన గుణాన్ని అలవర్చుకోవాలని మండల తహసీల్దార్ గంగయ్య తెలిపారు. బుధవారం మండల పరిధి ప్రకాశంపల్లెలోని ఆషా నిలయంలోని మూగ, బధిరుల పాఠశాలకు ఆర్కే హెల్పింగ్ కువైట్ వారి సహకారంతో, మీ కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ ఆదినారాయణ, మీ కోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్దన్, సహస్ర ఫౌండేషన్ సభ్యులు నాగ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన



గ్రామోత్సవంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు

పులివెందుల టౌన్ : పులివెందులలో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక తూర్పు ఆంజనేయస్వామి ఆలయంలో త్యాగరాజ స్వామి చిత్ర పటానికి నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయీ బ్రాహ్మణులు పట్టణ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గడప గడపకు 100 రోజులు పూర్తి

- గడప గడపకు 100 రోజులు పూర్తిచేసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం 100 రోజులు పూర్తి చేసుకుంది. ప్రజల కష్టాలు తెలుసుకుని వాటిని పరిష్కరించండి.. అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ సూచించారు. అయితే సీఎం ఆదేశానుసారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఇప్పటికి 100 రోజుల పూర్తి చేశారు. ఈ 100 రోజుల్లో ఆయన అధికారులతో కలసి లక్షల కుటుంబాలను కలిశారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించి బాధితులతో కృతజ్ఞతలు అందుకున్నారు. కాగా 100వ రోజు కమలాపురం వార్డు–2 సచివాలయ పరిధిలోని పడమట వీధి, రామ్‌నగర్, దర్గా వీధి, బీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి గడప గడపకు వెళ్లారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బాణా సంచా పేల్చుతూ స్వాగతం పలికారు. పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబ్ సుబహానీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ముతవల్లి నాసీర్ హుసేన్ వారికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. కరోనా సమయంలో సైతం ఎక్కడా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆపలేదన్నారు. కమలాపురం నియోజకవర్గంలో ఇప్పటికే రూ.1380 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండగా గత నెల సీఎం కమలాపురం వచ్చి రూ.905 కోట్లతో అభివృద్ధి పనులకు శంఖు స్థాపనలు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ 3.35 లక్షల కోట్లు ప్రజలకు పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మార్పూరి మేరీ, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, హిదాయత్, ఇర్ఫాన్, ఇస్మాయిల్, గఫార్, జావీద్, మోనార్క్, ఖాద్రి, నిఖిల్‌రెడ్డి, నాగమణి, అంబటి సురేష్, మస్తాన్, గౌస్‌మోహీన్, షావలి, ఖాజాపీర్, జిలానీ, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో జాప్యం వద్దు



ఇళ్ల పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ఎర్రగుంట్ల : జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు జాప్యం చేయకూడదని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలోని జగనన్న కాలనీలోని ఇళ్లను ఆయన బుధవారం పరిశీలించి మౌలిక వసతులపై మాట్లాడారు. ఇళ్లు నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందున్నారని అయితే వారికి కాలనీలో నీటి సదుపాయం, రోడ్లు కల్పించక పోవడంతో మున్సిపల్ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లన్నీ గుంతలు పడి ఉంటే కాంట్రాక్టర్లు సామగ్రిని ఏవిధంగా తరలించుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాలనీలో మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ విజయబాబు, కమిషనర్ పి.జగన్నాథ్, తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



రాణీవనం సచివాలయంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బంది ఆయా వార్డు కౌన్సిలర్ల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ పి. జగన్నాథ్ తెలిపారు. రాణీవనం, వినాయక నగర్, క్రాంతినగర్‌లలోని సచివాలయాల్లో వార్డు కౌన్సిలర్లతో బుధవారం ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వార్డులలో కౌన్సిలర్ల సూచనల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చంద్రకళ, వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ, థెరిస్సా, భాస్కర్, తుంగ వెంకట్రామిరెడ్డి, కల్లూరు సునీత, వైఎస్సార్ నాయకులు ప్రశాంత్, డేవిడ్, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, వార్డు అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

టీబీ బాధితులకు సకాలంలో వైద్య సేవలు



టీబీ సర్వేను పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి

ఎర్రగుంట్ల : టీబీ వ్యాధితో బాధపడుతున్న రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. బుధవారం ఎర్రగుంట్ల పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న టీబీ సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి ఇప్పటివరకు ఎన్ని టీబీ కేసులు నమోదయ్యాయోనని తెలుసుకునుటకు ఈ సర్వేను చేయిస్తున్నామన్నారు. ఎర్రగుంట్ల పీహెచ్‌సీ పరిధిలో 38 కేసులు నమోదైనట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇంటిని జాగ్రత్తగా సర్వే చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఇప్పటి వరకు 922 ఇళ్లను సర్వే చేయగా కొత్తగా ఒక్క పాజిటివ్ కేసు నమోదైనట్లు టీం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ డాక్టర్ గోపీకృష్ణ, జిల్లా టీబీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగేంద్రకుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, సూపర్‌వైజర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

చెన్నూరు : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. చెన్నూరు బెస్త కాలనీ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న జడ్జి పర్యావరణ పరిరక్షణ, పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు, బాల్య వివాహాలు, సీనియర్ సిటిజన్ చట్టం, వినియోగదారుల చట్టాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. అలాగే 181 ఉమెన్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 100 పోలీసు హెల్ప్‌లైన్, 14567 సీనియర్ సిటిజన్స్ హెల్ప్‌లైన్‌ల గురించి వివరిస్తూ అవసరమైన సమయాల్లో పైన తెలియజేసిన టోల్‌ఫ్రీ నెంబర్లను వినియోగించుకోవాలన్నారు. చట్టపరంగా ఎలాంటి అవసరమున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకు రావచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు, పారా లీగల్ వలంటీర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి

సంక్రాంతి పర్వదినం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి బింబం అని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కవిత పేర్కొన్నారు. బుధవారం చెన్నూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విజేత మహిళా మండలి అధ్యక్షురాలు గోసుల అరుణ కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా, సంతోషంగా జరుపుకుంటారన్నారు. మొదటి బహుమతిని శివప్రియ మెడికల్స్, రెండో బహుమతి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా చెన్నూరు వారి సౌజన్యంతో జడ్జి చేతుల మీదుగా అందజేశారు. మిగిలిన బహుమతులను విజేత మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రదానం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడు వీరప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడు వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎన్.పాలగిరి సచివాలయ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతోఆయన బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వలంటీర్‌లు ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మంజూరు కాకుండా ఉన్న వారిని గుర్తించి వారికి మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కన్వీనర్లకు సూచించారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే తమకు తెలియజేయాలని వెంటనే ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం వలంటీర్లు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కమలాపురం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, గ్రామ నాయకులు మునిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

ముద్దనూరు : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు గురువారం ఉదయం 6 గంటలకు ఉప్పలూరులో పర్యటించనున్నారు. రైతులతో కలిసి గురువారం ఉప్పలూరు, ఆకుతోటపల్లె గ్రామాలకు చెందిన పెద్ద చెరువును పరిశీలించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

చెన్నూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభించడానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి చెన్నూరుకు రానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాస్థాయిలో వేముల విద్యార్థికి రెండవ ర్యాంక్

వేముల : వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జడ కార్తీక్ అనే విద్యార్థి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మంచి ప్రతిభ కనబరిచారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన విజ్ఞాన్ మన్థన్ జాతీయ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి జిల్లాస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించాడు. కార్తీక్‌ను హెడ్మాస్టర్ నాగాంజనేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

చెన్నూరు : విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పుస్తకాల దాత పిడుగు శివనారాయణ తెలిపారు. బుధవారం ఆయన కొండపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 34 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసి మాట్లాడారు. ప్రతి యేటా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో జన్మించిన ఆడబిడ్డను చూపుతున్న సిబ్బంది

వల్లూరు : 108 వాహనంలో సుఖ ప్రసవం జరిగిన తల్లీ బిడ్డలను క్షేమంగా కడప రిమ్స్ ఆసుపత్రిలో చేర్చిన ఘటన బుధవారం వల్లూరు మండలంలో చోటు చేసుకుంది.వివరాలు.. తెలంగాణా రాష్ట్రం షాద్ నగర్‌కు చెందిన రమేష్, సావిత్రి దంపతులు వల్లూరు మండలంలోని తోల్లగంగనపల్లె సమీపంలో ఇటుకల బట్టీల వద్ద పని చేస్తున్నారు. గర్భిణిగా ఉన్న సావిత్రికి బుధవారం నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వల్లూరు 108 వాహన సిబ్బంది వచ్చి ఆమెను ఆసుపత్రికి తీసుకుని వెళుతుండగా మార్గ మధ్యలో ఆలంఖాన్‌పల్లె సర్కిల్ సమీపంలో ఈఎమ్‌టీ హర్షవర్దన్ ఆధ్వర్యంలో సేవలు అందించారు. దీంతో ఆమె ఆడ బిడ్డను ప్రసవించింది.

ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



ప్రజలు తెలిపిన సమస్యపై విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : అర్హులైన ప్రతినిరుపేదకు సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మతో కలిసి ఆయన 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కొందరికి రాలేదని తెలుసుకుని ఎందుకు రావడంలేదంటూ సచివాలయ ఉద్యోగులను ఆయన ప్రశ్నించారు. కొందరు కోటవీధిలో విద్యుత్తు స్తంభం కూలిపోయే విధంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన విద్యుత్తు అధికారులకు ఫోన్‌చేసి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనలో పెనుమార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రతి సమస్యను వార్డు, గ్రామ సచివాలయాలలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం కింద బాగుచేసి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. ముఖ్యమంత్రి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చి వారిని భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయిలో చూడాలనుకున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మునిసుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మార్బుల్ శ్రీను, మార్కెట్ యార్డు చైర్మన్ రమణారెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, పోచిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ ఆకుల బాబా, బడిగించల చంద్రమౌళి, బ్రహ్మానందరెడ్డి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు ఇబ్బంది లేకుండా ఉపాధి పనులు

డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి

వేముల : జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో వ్యవసాయ పనులకు ఇబ్బందులు లేకుండా ఉపాధి పనులను చేపట్టనున్నట్లు డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం వేములకు సమీపంలోని కొండ ప్రాంతంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన కందిత, కందకాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను గుర్తించి గ్రామాల్లో పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిలో పని కల్పించాలని సిబ్బందికి సూచించామన్నారు. వ్యవసాయ పనులు లేనిచోట ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. ఉపాధిలో చేసిన పనులకు కొలతవేసి సకాలంలో కూలీలకు కూలీ అందేలా చూడాలని సిబ్బందికి సూచించామన్నారు. అనంతరం ఉపాధిలో చేపట్టిన పండ్ల తోటల పెంపకంలో భాగంగా సాగు చేసిన చీనీ తోటలను పరిశీలించి అక్కడ ఉన్న రైతులకు చీనీ మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. చీనీ తోటలను నాలుగేళ్లపాటు కాపాడుకుంటే దిగుబడులు చేతికొస్తాయని వివరించారు. అనంతరం ఆయన ఉపాధి సిబ్బందికి ఉపాధి పనులపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ గంగరాజు, ఈసీ శ్రీనివాసులరెడ్డి, టీఏలు సురేంద్రారెడ్డి, సత్యనారాయణ, సంపత్, రామాంజి నాయక్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేంద్రనాథ్

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపీడీఓ సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలైన వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ రైతు భరోసా పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథక లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో పొందుపరచాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. త్వరలో 2022–23 ఆడిట్ జరుగుతుందని.. అన్ని సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు రికార్డులను సిద్ధం చేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సురేష్, అన్ని సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, హెల్పర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వేంపల్లె : పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థాన అనుసంధానమైన శ్రీఆంజనేయస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాలలో బుధవారం ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ కె.వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీ లెక్కింపు ద్వారా రూ.2,31,456లు, శ్రీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానంలో రూ.1,06,408లు, ఆంజనేయస్వామి ఆలయంలో రూ.58,669ల ఆదాయం రాగా.. మొత్తం మూడు ఆలయాల హుండీల లెక్కింపు ద్వారా రూ.3,96,583ల ఆదాయం వచ్చిందన్నారు. అలాగే 10.05 గ్రాముల బంగారు, వెండి వస్తువులు భక్తులు కానుకలుగా సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వినియోగించుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వేంపల్లె : గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఇళ్లలో ఉన్న మరుగుదొడ్లను ఉపయోగించుకుని వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని తాళ్లపల్లె పీహెచ్‌సీ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం వేంపల్లె సచివాలయం–8 పరిధిలోని పక్కీర్‌పల్లెలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన అనాగరికమని.. ప్రస్తుత సమాజంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో వేంపల్లె సచివాలయ సిబ్బంది బసయ్య, ఏఎన్ఎండీ అంజనమ్మ, అంగన్‌వాడీ టీచర్ దిల్షాద్, ఆశా కార్యకర్త జమీనా తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు



వేంపల్లెలో సంక్రాంతి సంబరాలలో పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, తదితరులు



వేంపల్లెలో సంక్రాంతి సంబరాలలో పాఠశాల కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి, తదితరులు



కమలాపురంలో ముగ్గుల పోటీల విజేతలతో కళాశాల కరస్పాండెంట్, సిబ్బంది

వేంపల్లె : పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు అని ఎంఈఓ వీరారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఉషా కిరణ్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వేంపల్లెలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి సంక్రాంతి పండుగ ప్రత్యేకత గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంఈఓ వీరారెడ్డిలు హాజరయ్యారు.

సింహాద్రిపురం : కోవరంగుంటపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం హెడ్మాస్టర్ అంగడి నాగేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

కమలాపురం : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక పీవీఎస్‌ఆర్‌ఎం జూనియర్ కళాశాలలో బుధవారం పాఠశాల, కళాశాల స్థాయిలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శివకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని షంపోర్డ్ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పాఠశాల కరస్పాడెంట్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భోగి మంటలను వేసి, ముగ్గులను వేశారు.